



కన్వర్షన్.. కరప్షన్..

నాలా కన్వర్షన్‌లో రెవెన్యూ వసూళ్లు



- ఫార్మ్ ల్యాండ్ పేరుతో గుంటల్లో విక్రయాలు
- వ్యవసాయ భూములను నివాస భూములుగా మార్చుకుంటున్న వైనం
- గుంట భూమిని గజాల్లోకి మార్చేందుకు చేతులు తడపాల్సిందే..
- పదుల సంఖ్యలో నాలా కన్వర్షన్ దరఖాస్తులు
- కొత్త డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వసూళ్లే..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దందా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలో కొంతమంది అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. వ్యవసాయ భూములను నివాస ప్లాట్లుగా మార్చేందుకు నాలా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నప్పటికీ రెవెన్యూలో చేతులు తడపనిదే కన్వర్షన్ కావటం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. భారీ వెంచర్‌లు చేస్తే పన్నుల భారం పడుతుందని భావిస్తున్న రియల్టర్లు.. వ్యవసాయ భూములను ఫామ్‌ల్యాండ్‌గా గుంటల్లో విక్రయిస్తున్నారు. గుంటల్లో కొనుగోలు చేసిన వ్యక్తులు నాలా కన్వర్షన్ చేయించేందుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రాంతాన్ని బట్టి గుంటకో రేటు పెట్టి మరీ వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం ఉంది. ప్రధానంగా జిల్లా కేంద్రాలకు సమీపంలో ఉన్న రెవెన్యూ అధికారులకు నాలా కన్వర్షన్ కాసుల పంట పండిస్తోందనే చర్చ జరుగుతోంది. మరోవైపు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ కొత్త డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు అదనంగా వసూళ్లకు దిగుతున్నారు. దీంతో కన్వర్షన్.. కరప్షన్‌గా మారిందనే విమర్శలున్నాయి.

గుంటల్లో విక్రయాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫామ్‌ల్యాండ్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ వెంచర్లు చేసేందుకు జంకుతున్నారు. వెంచర్లు చేస్తే అనుమతులతోపాటు 10శాతం భూమిని మునిపల్ కార్పొరేషన్‌కు పార్కుల అభివృద్ధి కోసం వదిలి పెట్టాల్సి వస్తోంది. అటు పన్నులు.. ఇటు భూమిని కోల్పోతుండటంతో భారీగా నష్టం వాటిల్లుతోందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో 10 ఎకరాల నుంచి వంద ఎకరాలకు పైగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫామ్‌ల్యాండ్‌గా మారుస్తున్నారు. వివిధ రకాల పండ్ల చెట్లు, కొబ్బరి చెట్లతో పాటు కూరగాయల సాగుకు అనుగుణంగా భూమిని తీర్చిదిద్దుతున్నారు. చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నారు. అనంతరం ఐదు గుంటల నుంచి పైకి ప్లాట్లుగా మారుస్తున్నారు. గజాల్లోకి మార్చాలంటే నాలా కన్వర్షన్‌తో పాటు కూడా అనుమతులు తీసుకుని లేఅవుట్ చేయాల్సి ఉండటం ఆర్థికంగా భారాన్ని పెంచుతోందని రియల్టర్లు భావిస్తున్నారు. ఫామ్‌ల్యాండ్‌లకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణిలోనే ఐదు గుంటల చొప్పున భూమి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆ తరువాత భూమి కొనుగోలు చేసిన వ్యక్తులకు పట్టాదారు పాసు బుక్‌లు చేతికి వచ్చిన తరువాత తాము కొనుగోలు చేసిన ఫామ్‌ల్యాండ్‌ను గుంటల నుంచి గజాల్లోకి నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్టు)కన్వర్షన్ చేయిస్తున్నారు. దీంతో రియల్టర్‌కు భారం తప్పుతుండగా, కొనుగోలు చేసిన వారికి తక్కువ ధరకు భూమి లభిస్తోంది. అయితే ప్రభుత్వానికే భారీగా నష్టం వాటిల్లుతోంది. పన్నులు, లేఅవుట్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందల ఎకరాల్లో ఫామ్‌ల్యాండ్ అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రుపాయల ఆదాయానికి గండి పడుతోంది.

నాలా కన్వర్షన్‌తో కాసులే..

రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉన్న ఏరియాల్లోని రెవెన్యూ సిబ్బంది, అధికారులకు నాలా కన్వర్షన్ కాసుల పంట పండిస్తోంది. ప్రధానంగా హనుమకొండ, వరంగల్ నగర పరిధి, సమీపంలో ఉన్న రెవెన్యూ సిబ్బంది, అధికారులకు కన్వర్షన్ కలిసి వస్తుందనే వ్యాఖ్యలు ఉన్నాయి. వరంగల్ నగర పరిధి భారీగా విస్తరిస్తోంది. అలాగే కొత్తగా ఏర్పడిన భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లా కేంద్రాలు కూడా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయ భూముల్లో కొత్తగా వెంచర్లతో పాటు ఫామ్ ల్యాండ్‌లు, నివాసం కోసం ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. వ్యవసాయ భూమిలో ఇంటి నిర్మాణానికి మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు రావటం కష్టం. అంతేకాకుండా బ్యాంకుల నుంచి కూడా రుణాలు ఇవ్వటం కుదరదు. దీంతో వ్యవసాయ భూములను గుంటల నుంచి గజాల్లోకి నాలా కన్వర్షన్ చేయిస్తున్నారు. అయితే ఎకరాల భూమిని గుంటల్లో అమ్మకాల సమయంలోనే ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే రెవెన్యూలోని అధికారులు ఏరియాను బట్టి గుంట భూమికి రూ.5వేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత నాలా కన్వర్షన్ చేయాలంటే 200గజాల స్థలానికి ఏరియాను బట్టి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. సమస్యాత్మక భూములైతే వాటికి వేరే రేటు ఉంటుందని సమాచారం. వరంగల్, హనుమకొండ నగరల్లో అయితే కన్వర్షన్‌కు లక్షల్లో వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇలా ప్రతీ నెల పదుల సంఖ్యలో నాలా కన్వర్షన్, ఫామ్‌ల్యాండ్ భూములను గుంటల్లో రిజిస్ట్రేషన్ చేయటం వంటి వాటితో కొంతమంది రెవెన్యూ సిబ్బంది, అధికారులకు భారీగానే ముట్టుతున్నాయనే చర్చ జరుగుతోంది. నాలా కన్వర్షన్ రెవెన్యూకు కరప్షన్‌కు కేరాఫ్‌గా మారిందనే ఆరోపణలున్నాయి. దీంతో కొంతమంది తహసీల్దార్‌లు వరంగల్, హనుమకొండ నగరాలతోపాటు కొత్త జిల్లా కేంద్రాల్లో, రియల్ భూమ్ ఉన్న ఏరియాల్లో పోస్టింగుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి.

కొత్త డాక్యుమెంట్‌కు అదనపు వసూళ్లు

వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్‌తో కథ ముగిసి పోవటం లేదు. గుంటల్లోంచి గజాలకు నాలా కన్వర్షన్ చేయించిన తరువాత, అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించాలంటే మళ్లీ చేతులు తడపాల్సిందేనట. నాలా కన్వర్షన్ అయినా భూమి నుంచి కొన్ని గజాల భూమిని ఇతరులకు విక్రయించేందుకు కొత్త డాక్యుమెంట్ తయారు చేయించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొత్త డాక్యుమెంట్ తయారు చేయించటంతో పాటు రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యే వరకు ఓ 200గజాల స్థలానికి భూమి విలువను బట్టి రూ.20వేల నుంచి రూ.1లక్షకు పైగా ఖర్చు వస్తుందని సమాచారం. ఇందులో డాక్యుమెంట్ రైటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు వాటాలు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. పాత డాక్యుమెంట్స్ కంటే కొత్తవాటికి 40శాతం అదనంగా వసూళ్లు చేస్తారని సమాచారం. మొత్తానికి వ్యవసాయ భూములను దొడ్డిదారిన కన్వర్షన్ చేయిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడితే అధికారులకు మాత్రం కాసుల పంట పండిస్తుందనే చర్చ జరుగుతోంది.

ఘనా అలంకారంలో భద్రకాళి

- అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఘనా అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 17 : వరంగల్‌లోని భద్రకాళి దేవస్థానంలో వైభవంగా కొనసాగుతున్న అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు బుధవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసిన అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించి నీలా పతాకా అలంకరణ చేశారు. భద్రకాళి అమ్మవారిని ఇచ్ఛాశక్తి క్రమంలో ఘనా అమ్మవారిగా అలంకరించి పూజలు చేసి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దశమహావిద్యలలో ఏకాదశికి ఆది దేవత ఘనా అమ్మవారు అని, ఈ అమ్మవారు మేఘాలను రంజింపజేసి వర్షం కురిపిస్తుందని, అమ్మవారిని అమృత వర్షిణిగా కూడా పిలుస్తారని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. నాలుగు నెలల పాటు యోగా నిద్రలో శేషపాన్పుపై విష్ణుమూర్తి నిద్రిస్తారని, ఆయన సోదరి అయిన జగన్మాత భక్తుల కోరికలను నెరవేరుస్తూ కాపాడుతుందని చెప్పారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం కావడంతో వేల మంది భక్తులు పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది.

వైభవంగా తొలి ఏకాదశి

- వైష్ణవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



వరంగల్ బట్టల బజార్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, జూలై 17: జిల్లాలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను బుధవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశిని పెద్ద ఏకాదశిగా కూడా పిలుస్తారు. తొలుత జరుపుకునే ఏకాదశిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పలు ఆలయాల్లో భగవద్గీత పారాయణం పఠించారు. జిల్లాలోని నర్సంపేటలో గల వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయం, దుగ్గొండి మండలంలోని ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి ఆలయం, కొమ్మాలలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయం, రాయపర్తి మండలం సన్నూరులోని వేంకటేశ్వరస్వామి, రామాలయంలో, పర్వతగిరిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వరంగల్ నగరంలోని ప్రసిద్ధ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బట్టల బజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వర స్వామికి 108 లీటర్ల ఆవుపాలతో, వేద మంత్రోచ్ఛరణలతో అభిషేకం నిర్వహించారు. వరంగల్ చౌరస్తా గీతా భవన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకృష్ణ భగవానుడికి, పోతన రోడ్డులోని శ్రీమురళీకృష్ణ మందిరంలో, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, కొత్తగుడి, కాశిబుగ్గలోని శ్రీరంగనాథస్వామి దేవాలయం, ములుగురోడ్‌లోని శ్రీవరద దత్తక్షేత్రం, డాక్టర్స్ కాలనీలోని వేంకటేశ్వరాలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి ఆలయం, శివనగర్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలిరాగా కిటకిటలాడాయి. బట్టల బజార్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ములుగురోడ్‌లోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గీతా భవన్‌లోని సేవాశ్రమంలో సామూహికంగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. ప్రజలు ఇళ్లల్లో పిండివంటలు చేశారు. భక్తులు ఉపవాసాలు ఆచరించారు. పలు ఆలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.

నేటి నుంచి డీఎస్సీ ప్రారంభం

- ఆగస్టు 5 వరకు సీబీటీ పద్ధతిలో నిర్వహణ
- హాజరుకానున్న 27,740 మంది అభ్యర్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 17 : ఉపాధ్యాయుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ గురువారం నుంచి ప్రారంభం అవుతుంది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పరీక్షలు.. ఆగస్టు 5 వరకు జరుగనున్నాయి. 13 రోజుల పాటు 26 సెషన్లలో జరుగుతున్న పరీక్షలకు 27,740 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు డీఈవో డి.వాసంతి స్థానిక నిర్వహణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎ.శ్రీనివాస్, బి.రాధ, బి.జుమ్మునాయక్, బి.సుదర్శన్ రెడ్డి తదితరులు పర్యవేక్షకులుగా వ్యహరిస్తున్నారు. జయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 6,500 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానుండగా, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కేంద్రంలో 3,120 మంది, అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో 3,850 మంది, మోక్షిత కంప్యూటర్స్‌లో పరీక్ష కేంద్రంలో 9,200మంది, నోబెల్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ పరీక్ష కేంద్రంలో 5,070 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

వాయిదాపై నేడు విచారణ

డీఎస్సీ వాయిదా వేయాలని కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. కొంత సమయం కావాలని, కొన్నినెలల పాటు డీఎస్సీని వాయిదా వేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే గురువారం హైకోర్టులో ఈ విషయంపై విచారణ చేపట్టనుంది. అయితే ప్రభుత్వం పరీక్షలకు షెడ్యూల్ ప్రకటించించడం, గురువారం నుంచే పరీక్షలు ప్రారంభం కానుండటం ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో డీఎస్సీ వాయిదా పడే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది.

రుణమాఫీ విధివిధానాల్లో లోపాలు

- సవరించి అందరికీ అమలు చేయాలి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 17: రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన విధి విధానాల్లో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని మార్పు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రైతు రుణమాఫీని స్వాగతిస్తున్నామని, ప్రజల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అయితే ప్రధానంగా కౌలు రైతులు, రైతుమిత్ర బృందాలను విస్మరించారని, వారికి కూడా రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రీషెడ్యూల్ చేసిన రుణమాఫీని వర్తింపచేయకుండా కుంటిసాకులతో కొంతమందిని రుణమాఫీ నుంచి మినహాయించాలని చూడడం సరికాదని హితవు పలికారు. పహణీలో పేరున్న వారికి రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పాస్‌బుక్కులు లేకుండా పహణీలో భూములున్న వారు చాలా మంది ఉన్నారని గుర్తుచేశారు.

రాష్ట్రంలో జన గణన, కుల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాఘవులు సూచించారు. బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్ కేటాయించాలనేది సందిగ్ధంలో ఉందని, వెంటనే కులగణన చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ బల్దియా అధికారులు కోర్టు తీర్పు పేరుతో గుడిసెవాసులను ఖాళీచేసే కుట్ర చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. నగరంలోని బందం చెరువు శిఖంలో విశ్రాంత ఆర్మీ అధికారులకు, విలేకరులకు, కుల సంఘాల నాయకులకు పట్టాలు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు వెలిశాయని, 30యేళ్ల కిందట వేసుకున్న గుడిసెలను తొలగిస్తామనడం అన్యాయమని రాఘవులు మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, నాయకులు వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాగుల రమేష్, చుక్కయ్య పాల్గొన్నారు.

డిల్లెం.. బల్లెం.. బీరన్నకు బోనం..

ఉర్సు, కరీమాబాద్ ప్రాంతంలో ఉప్పొంగిన భక్తిభావం

- బీరన్నకు ఘనంగా బోనాలు సమర్పించిన కురుమలు
- ఆకట్టుకున్న బీరన్నల నృత్య విన్యాసాలు



కరీమాబాద్(వరంగల్), జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన తమ ఆరాధ్య దైవమైన బీరన్న స్వామికి బుధవారం కురుమ కులస్థులు ఘనంగా బోనాలను సమర్పించారు. బీరన్న బోనాల సందర్భంగా వరంగల్‌లోని ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి ఎంతో నియమ నిష్టలతో ఉపవాస దీక్షలతో ఉన్న మహిళలు అపారమైన భక్తిభావంతో బోనాలను తలపై ఎత్తుకొని సాయంత్రం ఆలయాలకు బయలుదేరారు. చిన్న పెద్ద అంతా కలిసికట్టుగా బీరన్నకు బోనం సమర్పించేందుకు తరలిరావడంతో ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. అశేష భక్త జనంతో దారులన్నీ బీరన్న నామస్మరణతో మార్మోగాయి. ఉర్సు, కరీమాబాద్ నుంచి మహిళలు బోనాలతో తరలిరావడంతో బీరన్నకుంటలోని ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. ఆలయానికి చేరుకున్న కురుమలు తమ ఆరాధ్య దైవం బీరన్నస్వామి, కామరతి, అక్క మహంకాళిలను తన్మయత్వంతో కొలిచి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలను నెరవేర్చాలని, పిల్లాపాపలను సల్లంగా చూడాలని బీరన్నను వేడుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా బీరన్న స్వామికి కురుమ కులస్థుల ఆధ్వర్యంలో ఉర్సు కురుమల కులపెద్ద మరుపల్ల రవి ఇంటి నుంచి ఉదయం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో బీరన్నకు, కామరతి దేవతామూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్య సమాజ్ జెండాను బీర వాసుదేవ్ చేతబూని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చి బీరన్నకుంటలోని ఆలయానికి చేరుకున్నారు. పాలకుర్తి నుంచి వచ్చిన ఒగ్గు కళాకారులు ఆచారం ప్రకారం సుంకు బియ్యం పిడికెడు తీసుకొని ఇంటింటికి తిరుగుతూ బోనాలను చేయాల్సిందిగా చాటింపు చేశారు. ఆ సుంకు బియ్యానికి తమ బియ్యాన్ని కలిపి బీరన్నకు మహిళలు బోనం సిద్ధం చేశారు. తదుపరి బోనాలు బయలుదేరిన సందర్భంలో చెట్లవారి గడ్డ నుంచి

మిగతా 6వ పేజీలో..



కరీమాబాద్‌లో తలపై బోనాలతో వరుస క్రమంలో వస్తున్న మహిళలు



బోనం ఎత్తుకున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్ గుండు సుధారాణి

బోనమెత్తిన మంత్రి సురేఖ..

బీరన్న బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ కరీమాబాద్ బొడ్రాయి వద్ద తలపై బోనాన్ని ఎత్తుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ బీరన్న బోనాలు ఈ ప్రాంతంలో అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. బీరన్న కృపతో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. బీరన్న దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు.

నేడు రూ.లక్ష లోపు రుణమాఫీ ప్రారంభం

జిల్లాలో 22,061 మందికి లబ్ధి
హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

వరంగల్ కలెక్టరేట్, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకాన్ని అమలులోకి తెచ్చినందుకు అన్నదాతల్లో హర్షం వ్యక్తం అవుతోంది. తొలి విడతగా రూ.లక్షలోపు ఉన్న రుణాల మాఫీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి రూ.లక్ష లోపు ఉన్న రుణాల మాఫీ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా 22వేల 61 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతుల రుణ ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా డబ్బులు జమ చేస్తుంది. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు రుణమాఫీ చేస్తానని చేసిన ప్రకటనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి రుణాల మాఫీకి పూనుకుంది. ఇందులో భాగంగా రూ.లక్ష లోపు రుణాలు ముందుగా మాఫీ కానున్నాయి. ఆగస్టు 15వ తేదీ లోగా రూ.2లక్షల రుణాలు సైతం మాఫీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

22,061 మంది రైతులకు లబ్ధి

మొదటి విడతలో రూ.లక్ష వరకు ఉన్న రుణాలు మాఫీ చేయడం మూలంగా జిల్లాలోని 13 మండలాల్లో 22,061 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలిలా ఉన్నాయి. చెన్నారావుపేట మండలంలో 1,296 మంది రైతులు, దుగ్గొండి 1,900, గీసుగొండ 1,387, ఖానాపూర్ 1,297, ఖిలావరంగల్ 345, వరంగల్ 73, నల్లబెల్లి 1,819, నర్సంపేట 2,049, నెక్కొండ 2,648, పర్వతగిరి 2,550, రాయపర్తి 2,909, సంగెం 1,957, వర్ధన్నపేట మండలంలో 1,831 మంది లబ్ధిదారులు ఉన్నారు.

రైతు వేదికల వద్ద సంబరాలు

ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు మొదటి విడత రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద సంబరాలు నిర్వహించనున్నారు. సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి వేడుకలు జరుపుకోనున్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని రైతు వేదికలోజరిగే సంబరాల్లో పాల్గొంటారు. నర్సంపేటలోని రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేటలోని రైతు వేదికలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పాల్గొంటారు.

నిధులు పక్కదారి పడితే చర్యలు

కలెక్టర్ డాక్టర్ సత్యశారద

రూ.లక్ష లోపు ఉన్న రైతుల రుణాలు రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తోంది. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రైతుల ఖాతాల్లో కాకుండా ఇతర ఖాతాల్లో జమ చేసుకుంటే బ్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెల్లువెత్తిన తొలి పూజలు

ఆలయాల్లో ఘనంగా తొలి ఏకాదశి - దర్శనాలకు బారులుదీరిన భక్తులు



వేయిస్తంభాల ఆలయంలో వేడుకలు ప్రారంభిస్తున్న కుడా చైర్మన్

హనుమకొండ కల్చరల్, జూలై 17: భక్తితత్వానికి పేరెన్నికగన్న చారిత్రక ఓరుగల్లు నగరిలో హిందువుల తొలిపర్వమైన తొలి ఏకాదశి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలుండి ఆలయాలను సందర్శించి తరించిపోయారు. తెల్లవారుజామున్నే లేచి ఇంట్లో దీపారాధన చేసుకొని ఇష్టదైవమైన ఆలయాలకు తరలివెళ్లారు. ముఖ్యంగా నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు.

త్రికూట ఆలయంగా పేరుగాంచిన వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఉదయమే కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆయనచే ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి స్వామివారి శేషవస్త్రాలు అందజేసి, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటయ్య ఈ సందర్భంగా కుడా చైర్మన్‌కు ఒక వినతి అందజేస్తూ దేవాలయం ముందు భాగంలో 20 గజాల స్థలాన్ని పూజా సామగ్రి కోసం కేటాయించాలని కోరారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఈవో కుడా చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దేవాలయం ముందుభాగం కళాకారుల కోసం ప్రత్యేక రేకుల షెడ్డు నిర్మించనున్నట్లు కుడా చైర్మన్ వెల్లడించారు. భక్తులకు కుడా ద్వారా చేయించాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

అలాగే హనుమకొండలోని అదాలత్ శ్రీభూ నీలాసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు దేశికన్ స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహింపజేసి స్వామివారిని తులసీదళ మాలలతో నేత్రపర్వంగా అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. ఇక్కడ ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్ల మధ్య పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు సులువుగా ప్రసాదాలను స్వీకరించారు. ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం, రెవెన్యూ రామాలయం, ఏకశిల పార్కు సమీపంలోని రామాలయం, కాజీపేటలోని శ్వేతార్క మూల దేవాలయం, రైల్వే టెంపుల్ కాంప్లెక్సులోని వెంకటేశ్వరాలయం, బ్రాహ్మణవాడలోని శ్రీ హనుమద్గిరి రంగనాథ దేవాలయం (పెద్ద కోవెల), చిన్న కోవెలగా ప్రసిద్ధి చెందిన సీతారామచంద్రాస్వామి దేవాలయంలో కూడా తొలి ఏకాదశి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సహకార సంఘాల విస్తరణ ఎప్పుడు?

హనుమకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు వెన్నుదన్నుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) పల్లెల్లోని రైతులకు పట్టుగొమ్మలాంటివి. పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తూ అండగా నిలుస్తున్నాయి. పంటలను కొనుగోలు చేస్తూ సేవలందిస్తున్నాయి. రైతులకు విశేషమైన సేవలు అందిస్తున్న పీఏసీఎస్‌ల గురించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వాటి బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వీటిపై ఇంకా దృష్టిసారించలేదు. పాలకులు పట్టించుకోకపోవడంతో పీఏసీస్‌ల సేవలు విస్తృతం కావడం లేదు. ఆయా సంఘాల పరిధి ఎక్కువగా ఉండటం.. గ్రామాలకు దూరంగా సంఘాలు ఉండడంతో అన్నదాత ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఒక్క సహకార సంఘం లేకపోవడంతో ఆ మండల రైతులు ఇతర మండలాల్లోని సొసైటీకి వెళ్లాల్సి వస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో తక్కువ గ్రామాలుండగా.. మరికొన్ని సొసైటీలకు ఎక్కువ గ్రామాలున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న సొసైటీలకు వివిధ పనులపై రైతులు వెళ్లిరావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ చైతన్యం, పలుకుబడి కలిగిన నాయకుల చొరవవల్ల ఆ మండలాలు చిన్నవైనప్పటికీ రెండు నుంచి మూడు సొసైటీలు ఉన్నాయి. మిగతా మండలాల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

గతంలో విభజన ప్రతిపాదనలు

జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగిన తర్వాత ఆ మేరకు రైతుకు సహకార సేవలు మరింతగా అందందేకు వీలుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సహకరా సంఘాల విస్తరణను చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సహకార శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించి ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలకు అదనంగా ఎన్ని అవసరమవుతాయో అంచనా వేసి ప్రతిపాదనలు తయారు చేశారు. నివేదికలను ప్రభుత్వానికి పంపారు. సహకార సంఘాల విభజనకు రంగం సిద్ధమైంది. డ్రాఫ్టు నోటిఫికేషన్ కూడా జారీ అయింది. ఇక సహకార సంఘాల విభజనే తరువాయి అనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం అటకెక్కించింది. 2021లో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘన విజయం సాధించడంతో రాజకీయ లబ్ధిపొందేందుకు ఇదే వేడిలో సహకార సంఘం ఎన్నికలు జరపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. సహకార సంఘాల విస్తరణ ప్రక్రియను పక్కనబెట్టి మున్సిపల్ ఎన్నికలు జరిగిన పదిహేను రోజులకే సహకార ఎన్నికలను నిర్వహించారు. వాస్తవానికి సహకార సంఘాల ఎన్నికలకు 30 రోజులు గడువు ఉండాలి. కానీ కేసీఆర్ సహకార చట్టంలో సవరణ చేసి మరీ ఎన్నికలు జరిపించారు. ఆ విధంగా సహకార సంఘాల విస్తరణకు బ్రేక్ పడింది.

ప్రతీ గ్రామంలో మూడు సంఘాలు

సహకార సంఘాల ఏర్పాటుకు సంబంధించి గతంలో కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ సహకార విధానానికి శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం ప్రతీ గ్రామానికి ఒక ప్రాథమిక సహకార సంఘం, ఒక మత్స్య సహకార సంఘం, ఒక పాల ఉత్పత్తి సహకార సంఘం ఉండాలనేది ఈ నూతన సహకార విధానం భావన. కేంద్ర సహకార శాఖ మంత్రిగా అమిత్‌షా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్వహించిన జాతీయ సహకార సదస్సులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నూతన విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు కూడా షా సూచనలు ఇచ్చారు. గత ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఏం చేస్తుందనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. గ్రామానికి ఒకటి కాకుండా కనీసం రెండు మూడు గ్రామాలకు కలిపి ఈ మూడురకాల సంఘాలు ఉండేలా చూడాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది.

- అందరికీ అందని సహకార సేవలు
- గతంలో ప్రతిపాదనలు.. ఆ తర్వాత బుట్టదాఖలు
- కొత్త మండలాల్లో ఏర్పాటు కాని పీఏసీఎస్‌లు
- కొత్త సహకార సంఘాలపై ఇంకా దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు
- ఉమ్మడి జిల్లాలో అదనంగా ఏర్పాటు కానున్న 300 పీఏసీఎస్‌లు



శాయంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

రెండు రకాల ప్రతిపాదనలు

సహకార సంఘాల సేవలు విస్తరించాలన్న కేంద్ర నిర్ణయం ప్రతిపాదనల దశ దాటలేదు. ఉన్నవాటితో పాటు కొత్తవాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. వాటికి గ్రహణం పట్టినట్టు కనిపిస్తోంది. అయితే కేంద్రం ప్రతీ రెవెన్యూ క్లస్టర్‌కు ఒక ప్రాథమిక సహకా సంఘం ఉండేలా చూడాలన్న మరో ప్రతిపాదన కూడా చేసింది. కాగా, కొత్త మండలాలకు మాత్రమే పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలన్నది గత రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన. రెవెన్యూ క్లస్టర్ల వారీగా.. అంటే మాత్రం తిరిగి కొత్త ప్రతిపాదనలు సభ్యుల విభజన, రుణ, డిపాజిట్ల విభజన అన్ని చేయాల్సి ఉంటుందన్న కారణంతో గత కేసీఆర్ సర్కారు పక్కనపడేసింది. ఆ విధంగా కేంద్ర నిర్ణయం అమలుకు గ్రహణం పట్టడంతో సహకార సేవల విస్తరణపై రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. ఉమ్మడి జిల్లాలో కొత్త మండలాలతో కలుపుకొని కొత్తగా మరో 180 పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. వ్యవసాయ క్లస్టర్ల ఆధారంగా ఏర్పాటు అయితే ఉమ్మడి జిల్లాలో ఉన్నవాటికి అదనంగా మరో 300వరకు సంఘాలు ఉండనున్నాయి.

విభజిస్తేనే మేలు

వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే సహకార సంఘాల సేవలను అందుబాటులోకి రావాలంటే వాటిని విభజించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలని రైతులు కోరుతున్నారు.

ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉండగా ఏ అవసరం వచ్చినా అక్కడ క్యూకట్టాల్సి వస్తోంది. ప్రతీ సీజన్ ఆరంభంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు బారులు తీరిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం సొసైటీల విభజనపై దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

డీసీసీబీలదీ అదే పరిస్థితి

గతంలో ఉమ్మడి జిల్లాకు ఒకే డీసీసీబీ ఉంది. జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన జిల్లాలకు డీసీసీబీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించినా కేంద్రం పరిధిలో ఉంది కాబట్టి అడుగు ముందుకు పడలేదు. తాజాగా కేంద్ర నిర్ణయం కారణంగా కేవలం ప్రాథమిక సహకార సంఘాలే కాకుండా డీసీసీబీల ఏర్పాటు కూడా చేయాల్సి ఉంటుంది. ఉన్న జిల్లాలనే కుదించే యోచనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తోంది. జిల్లాకో డీసీసీబీ సాధ్యపడుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాల వారీగా పీఏసీఎస్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రైతు సేవా సహకార సంఘాలు (ఎఫ్ఎస్‌సీఎస్), విశాల సహకార సంఘాలు (ఎల్ఎస్‌సీఎస్)లు కలుపుకుని మొత్తం 100 వరకు ఉన్నాయి. వీటిలో పీఏసీఎస్‌లు 91కాగా, ఎఫ్ఎస్‌సీఎస్‌లు 8, ఎల్ఎస్‌సీఎస్ ఒకటి ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 17 పీఏసీఎస్‌లు ఉండగా, వరంగల్ జిల్లాలో 28, జనగామ జిల్లాలో 14 , మహబూబాబాద్ జిల్లాలో 19, ములుగు జిల్లాలో 12, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 10 పీఏసీఎస్‌లు ఉన్నాయి. మండలాల పునఃవ్యవస్థీకరణ జరిగిన తర్వాత ఈ సహకార సంఘాల సేవా పరిధులు మారాయి. కొత్తగా ఏర్పాటైన మండలాల్లో కొత్తగా పీఏసీఎస్‌ల ఏర్పాటు జరగలేదు. కొన్నిచోట్ల ఒకే మండలం పరిధిలో మూడు, నాలుగు పీఏసీఎస్‌లు ఉండగా, కొన్నిచోట్ల అసలే లేవు. కొన్ని చోట్ల మండలానికి ఒకటి ఉండగా మరికొన్ని చోట్ల విస్తీర్ణం పెద్దగా ఉన్న ఉన్న మండలాల్లో రెండు ఏర్పాటు చేశారు. ఒక మండలంలో నాలుగు పీఏసీఎస్‌లు కూడా ఉన్నాయి. పూర్వ వరంగల్ జిల్లాలో 50 మండలాలు ఉండేవి. మండలాల పునఃవ్యవస్థీకరణ తర్వాత వాటి సంఖ్య 77కు పెరిగింది. కొత్తగా ఏర్పాటైన మండలాల్లో కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు జరగలేదు. ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌లలో 8.42 లక్షలకుపైగా సభ్యులున్నారు. కేంద్రం ప్రతిపాదించిన కొత్త జాతీయ సహకార విధానం అమలులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో అదనంగా మరో 300 సంఘాలు ఏర్పడే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

పదోన్నతులు ఇప్పించాం.. సభ్యత్వాలు పెంచండి..

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 17: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించామని, సంఘం సభ్యత్వాలను గణనీయంగా పెంచాలని పీఆర్టీయూ సంఘం సభ్యత్వాలను పెంచాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు బదిలీలు ఇప్పించిన ఘనత పీఆర్టీయూకే దక్కుతుందన్నారు. ఈ నెల 18 నుంచి 31 వరకు పీఆర్టీయూ సభ్యత్వాల పక్షోత్సవాల్లో సభ్యత్వాలను పెంచాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్టీయూతోనే పరిష్కరించబడుతాయన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికుల నియామకం, పీఆర్సీ, నూతన హెల్త్ స్కీమ్ తదితర అంశాలను ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.రవీందర్‌రెడ్డి, ఎండి. గఫార్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. తిరుపతిరెడ్డి, పి. శ్రీహరి, నాయకులు రాఘవరెడ్డి, రెండు జిల్లాల మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ కులగణన సాధన సభను జయప్రదం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, జూలై 17: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే బీసీ కులగణన సాధన సభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణనను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి పెంచడానికే తాము సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, తమ్మల శోభారాణి, తౌటం రవీందర్, బచ్చు ఆనం దం, అశోక్ గౌడ్, మధు, డాక్టర్ ఒడితెల రాము, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అమలు కాని జోనల్ విధానం

నీటిపారుదల ఉద్యోగుల బదిలీల్లో మాయాజాలం

కాళోజీ జంక్షన్, జూలై 17: నీటి పారుదలశాఖలో ఉద్యోగుల బదిలీల్లో జోనల్ విధానం అమలు కావడం లేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. 2018లో రాష్ట్రపతి ఉత్తర్వులు అమలులోకి వచ్చినప్పటి నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో జోనల్ విధానం అమలులోకి వచ్చిందని, కానీ నీటి పారుదల శాఖలో మాత్రం జోనల్ విధానాన్ని అమలు చేయకుండా చీఫ్ ఇంజనీర్ యూనిట్ పరిధిలోనే సీనియారిటీ పరిగణిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జోన్‌కు అలాట్ అయిన వారిని యాదాద్రి జోన్‌లో, యాదాద్రి జోన్‌లో అలాట్ అయిన వారిని భద్రాద్రి జోన్‌లో పనిచేయిస్తున్నారని చెబుతున్నారు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు పూర్తిగా విరుద్ధమని అంటున్నారు.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ జీవోప్రకారం షెడ్యూల్ తేదీల్లో కౌన్సెలింగ్ ద్వారా నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పని సరిగా బదిలీ చేయాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు గుర్తు చేస్తున్నారు. అంతేగాకుండా 20ఏళ్ల నుంచి హనుమకొండలో పనిచేస్తూ ఇంకా ఉద్యోగ సంఘాల నేతలంటూ కొందరు, తప్పుడు మెడికల్ పత్రాలతో, మరికొందరు ఉద్యోగులు బదిలీ నుంచి తప్పించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందని, దీనిపై ఇంజనీర్ ఇన్ చీఫ్ దృష్టి సారించి జీవో ప్రకారంగా పారదర్శకంగా కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టే విధంగా అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. మిగతా ప్రభుత్వ శాఖల్లో వ్యక్తిగత కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేస్తుండగా, నీటి పారుదల శాఖలో మాత్రం జీవోకు వ్యతిరేకంగా బదిలీ చేసేందుకు పావులు కదుపుతున్నట్లుగా విశ్వసనీయంగా తెలుస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.

ఫలించిన విద్యార్థినుల పోరాటం

కేయూలోని సకల సౌకర్యాల హాస్టల్‌లోకి మార్పు ▸▸ వాషింగ్ మిషన్, సీసీ కెమెరాలు, ఫెన్సింగ్ ఏర్పాటు



సమ్మక్క నూతన హాస్టల్స్ భవనం

కేయూ క్యాంపస్, జూలై 17: కాకతీయ యూనివర్సిటీలో పోతన హాస్టల్ విద్యార్థినుల పోరాట ఫలితం దక్కింది. పోతన హాస్టల్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థినుల నిరసన, ఆందోళనతో వర్సిటీలో నూతన హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చింది. విద్యార్థినుల ఇబ్బందులను గమనించిన వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని రెండు రోజుల్లో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా పక్కందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానంగా విద్యార్థినుల భద్రత కోసం సీసీ కెమెరాలు, వాషింగ్ మిషన్‌తో పాటు నూతన హాస్టల్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

పెరిగిన అడ్మిషన్లు

కాకతీయ యూనివర్సిటీలో ఐదేళ్లుగా విద్యార్థినుల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది. అయితే అందుకనుగుణంగా వర్సిటీ ఉన్నతాధికారులు హాస్టళ్లను అందుబాటులో తేలేదు. పాత కాలపు పద్మాక్షి లేడీస్ హాస్టల్ ఒక్కటే దిక్కుగా మారింది. వర్సిటీలో విద్యార్థినులకు ఇరుకు గదుల్లో కుక్కే పరిస్థితి నెలకొంది. వర్సిటీలో హాస్టళ్ల సౌకర్యాలపై వర్సిటీ ఉన్నతాధికారులు అనేక మార్లు మల్లగుల్లాలు పడాల్సి వచ్చింది. చివరికి గిరిజన సంక్షేమ శాఖ నిధులతో హాస్టల్ నిర్మాణానికి నిధులను కేటాయించింది. వర్సిటీ సుమారు 250 మంది విద్యార్థినులు ఉండేందుకు అధునాతన సౌకర్యాలతో సమ్మక్క హాస్టల్‌ను నిర్మించారు.

సౌకర్యాల ఏర్పాటు

కార్పొరేట్ కళాశాలల్లోనూ లేని విధంగా కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ అధికారులు విద్యార్థినులు నూతనంగా నిర్మించిన సమ్మక్క హాస్టల్‌లో బట్టలు ఉతుక్కునేందుకు వాషింగ్ మిషన్‌ను సమకూర్చారు. ప్రధానంగా మినరల్ వాటర్, సకల సౌకర్యాల గదులను ఇప్పించారు.



హాస్టల్ చుట్టు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



వాషింగ్ మిషన్

ఇంజనీరింగ్ శాఖ కార్మికులను ఆదుకోవాలి..

టీబీఎంయూ జిల్లా అధ్యక్షుడు వక్కల రాణాసాగర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 17: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మృతి చెందితే సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చిన్నచూపు చూస్తున్నారని తెలంగాణ బహుజన మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం (టీబీఎంయూ) జిల్లా అధ్యక్షుడు వక్కల రాణాసాగర్ మండిపడ్డారు. పైడిపెల్లికి చెందిన జన్ను పటేల్(45) బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని టీబీఎంయూ నాయకులు కలిసి పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా రాణాసాగర్ మాట్లాడుతూ.. బల్దియాలో పనిచేసే కార్మికులు మృతిచెందితే సంబంధిత అధికారులు స్పందించి దహన సంస్కారాల కోసం ముందస్తుగా రూ.10వేల నగదును ఇచ్చేవారని, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆ సోయి మరిచి కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. శానిటేషన్ విభాగంలో కార్మికులు మృతి చెందితే వెంటనే సీఎంహెచ్‌వో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి రూ.10వేలు ఇస్తున్నారని, మరి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ స్పదించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, మరణాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. వెంటనే మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా మృతుడి కుటుంబాన్ని కలిసిన వారిలో సంఘం నాయకులు సుద్దాల కుమార్, ఎర్ర వరదరాజు, చిరంజీవి, విక్రం, కృష్ణ, బిక్షపతి, బాబులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

ఘనంగా ఆషాఢ మాస వన భోజనాలు

- ఆడిపాడిన బంజారాలు
- ఉట్టిపడిన సంస్కృతీ, సంప్రదాయాలు

వడ్డెపల్లి, జూలై 17: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్, పోలీసు కాలనీ, ఉషోదయ కాలనీలకు చెందిన బంజారాలు బుధవారం దేవన్నపేట శివారు రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న కత్తిగుట్ట వద్ద సామూహిక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 50 బంజారా కుటుంబాల సభ్యులు వన భోజనాలకు తరలి వెళ్లి బంజారా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఆటలు ఆడి పాటలు పాడారు. బంజారా మహిళలు, పురుషుల నృత్యాలతో కత్తిగుట్ట ప్రాంతం పరవశించిపోయింది.



వన భోజనాలకు హాజరైన బంజారాలు

సుమారు వివిధ కాలనీలకు చెందిన 50 కుటుంబాల బంజారాలు ఒకే వేదిక వద్దకు చేరుకొని కుశలప్రశ్నలను వేసుకొని ఆచారాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లంబాడ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ మాట్లాడుతూ సామూహిక వన భోజనాలు భారతీయ ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా నిలుస్తాయని అన్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే ప్రజలంతా కేవలం ఏడాదికొక్కసారైనా వన భోజనాల కార్యక్రమాన్ని చేపట్టి ఆచారాలు అంతరించిపోకుండా కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బంజారా నేతలు లావుడియా విజయ హేమానాయక్, అజ్మీరా రమాదేవి శ్రీనివాస్, సింధూ హరిప్రసాద్, అనసూయ నవీన్, వనిత గోవర్ధన్, గుగులోత్ లలిత వెంకన్న, సునిత రవి, లావుడియా సరిత సునిల్, కవిత జయపాల్, సునిత హన్మంతు, రాందాస్ గంగా తదితరులు పాల్గొన్నారు.

నేడు 'తెలంగాణ పోరు-గద్దర్' పాత్రపై సదస్సు



అబివాదం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

బాలసముద్రం, జూలై 17: హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం తెలంగాణ పోరు-గద్దర్ పాత్రపై అన్ని వర్గాల మేధావులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో విద్యార్థి సంఘ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చేసిన పోరాటం ఆయన పాత్రను ఈ సమాజానికి తెలిపేందుకే ఈ సదస్సు అని అన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య రానున్నట్లు వారు తెలిపారు. ఆగస్టు 6న గద్దర్ మరణించి ఏడాది గడుస్తున్న సందర్భంగా ఆయన విగ్రహాన్ని కాళోజీ కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసి, కళాక్షేత్రానికి గద్దర్ నామకరణం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు నరేశ్, కన్నం సునీల్, రంజిత్, రాజేందర్, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు లక్కీడ్రా బహుమతుల ప్రదానం




ప్రయాణికులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్‌ఎం విజయభాను

బాలసముద్రం, జూలై 17: ఆర్టీసీ డీలక్స్ బస్సులలో హనుమకొండ ఉప్పల్-హైదరాబాద్ రూట్‌లలో ప్రయాణించిన మహిళ ప్రయాణికులకు నిర్వహించిన లక్కీడ్రాలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం అందించారు. ప్రథమ బహుమతి కొత్తగూడెంకు చెందిన మండల రాజ్యం, ద్వితీయ బహుమతి వరంగల్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన ఎం.ఊర్మిళ, తృతీయ బహుమతి హనుమకొండ గుడిబండల్‌కు చెందిన మౌనికలకు అందజేసినట్లు ఆర్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్ సింగ్, డిప్యూటీ రీజనల్ మేనేజర్స్ కె.భానుకిరణ్, మాధవరావులు, వరంగల్ డిపో-1 మేనేజర్ మోహన్‌రావు, డిపో-2 మేనేజర్ జి.సురేష్, జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

బాలసముద్రం, జూలై 17: అక్రమంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాజీపేట విష్ణుపురికి చెందిని ఫ్రాన్సియా ఆడం అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పని చేస్తూనే గంజాయికి అలవాటు పడ్డాడు. ఈక్రమంలో నిందితుడు గంజాయికి ఉన్న విలువను గుర్తించి తాను కూడా గంజాయిని విక్రయించి సులభంగా డబ్బును సంపాదించాలనుకున్నాడు. భద్రాచలంలో పరిచయమైన హుస్సేన్ అనే వ్యక్తి ద్వారా ఒడిషా నుంచి గంజాయిని తెప్పించుకుని ట్రై సిటీ పరిధిలో ఎక్కువ ధరకు విక్రయించేవాడు. ఈ క్రమంలో సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హంటర్‌రోడ్డులోని కోడెం ఫంక్షన్ హాల్ సమీపంలో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద గంజాయిని గుర్తించిన పోలీసులు సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి విక్రయదారుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ గాలిబ్, కానిస్టేబుల్ సత్యనారాయణ, అలీ, ప్రభాకర్‌లను ఏసీపీ దేవేందర్‌రెడ్డి అభినందించారు.



గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చూపిస్తున్న దృశ్యం

డాక్టర్ శ్రీధర్‌రెడ్డి హఠాణ్మరణం తీరని లోటు



డా.శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 17: తెలంగాణ డిగ్రీ కళాశాలల విశ్రాంత అధ్యాపక సంఘం రాష్ట్ర సలహాదారు, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆకస్మిక మరణం పట్ల ఆ సంఘం ప్రతినిధులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక సేవలు అందించిన శ్రీధర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని వారు గుర్తు చేసుకున్నారు. సంతాపం ప్రకటించిన వారిలో సంఘం నాయకులు ఎల్.వేణు, ఎం.రాములు, కె.సదాశివరెడ్డి, కె.సోమిరెడ్డి, ఎస్.విష్ణుచరణ్ తదితరులు ఉన్నారు.

అల్పాహారం పథకానికి నిధుల మంజూరు

- ఉమ్మడి జిల్లాకు రూ. 1.13 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- రాష్ట్రంలోనే అత్యధికంగా జనగామ జిల్లాకు రూ. 77.92 లక్షలు

లింగాలఘణపురం, జూలై17: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేస్తున్న అల్పాహార పథకానికి పాఠశాల విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. గతేడాది ప్రారంభమైన అల్పాహార పథకానికి డిసెంబర్-2023 వరకు బిల్లులు మంజూరు కాగా, ఆ తర్వాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు డిసెంబర్-2024 వరకు జిల్లాల వారీగా బడ్జెట్‌ను కేటాయిస్తూనే నిధులు మంజూరు చేస్తూ స్కూల్‌ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ.వి.నర్సింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 1,13,52,107లు మంజూరయ్యాయి. వాటిలో వరంగల్‌కు రూ.7,79,303, ములుగుకు రూ.14,93,400, మహబూబాబాద్‌కు రూ.5,69,889, జయశంకర్ భూపాలపల్లికి రూ.53,506, జనగామకు రూ.77,92,244, హనుమకొండకు రూ.6,63,765లు మంజూరయ్యాయి. అయితే తెలంగాణలోనే అత్యధికంగా జనగామ జిల్లాకు బడ్జెట్ కేటాయించడం విశేషం.



నేరెళ్ల శారదను సత్కరిస్తున్న పోశాల పద్మ

నేరెళ్ల శారదను కలిసిన కార్పొరేటర్ పద్మ

శంభునిపేట, జూలై 17 : తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారదను వరంగల్ నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో శారదను పద్మస్వామి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. పోశాల పద్మ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. నేరెళ్ల శారదతో కలిసి పార్టీలో పనిచేశారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధితో పాటు పలు విషయాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.



బీరన్నలతో గంట రవికుమార్



బోనం ఎత్తుకున్న నన్నపునేని నరేందర్

డిల్లెం.. బల్లెం.. బీరన్నకు బోనం..

(3వ పేజీ తరువాయి)

బీరన్నలు చేసిన నృత్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కరీమాబాద్ ప్రాంతంలో కురుమల కుల సంఘం భవనం నుంచి ఆనవాయితీ ప్రకారం ఆలయకమిటీ అధ్యక్షుడు కోరె సదానందం, కమిటీ బాధ్యులు పట్టు వస్త్రాలు, జాతీయ జెండాను చేతబూని పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ తంతుతో కరీమాబాద్ బీరన్న బోనాలు ప్రారంభమయ్యాయి. సైదాపూర్ నుంచి బీరన్నలు ఇంటింటికి తిరుగుతూ బోనాలను చేయాల్సిందిగా చాటింపు చేశారు. అన్ని సిద్ధం చేశాక సాయంత్రం మహిళలు భక్తి పారవశ్యంతో తలపై బోనాలతో వరుస క్రమంలో కరీమాబాద్ పురవీధులు గుండా ఆలయానికి బయలుదేరారు. బోనాలు ఆలయానికి వస్తున్న క్రమంలో సైదాపూర్ బీరన్నలు చేసిన నృత్యాలు, విన్యాసాలు, కరీమాబాద్ ప్రాంతం బొమ్మల గుడి సమీపంలో గల బొడ్రాయి వద్ద గొర్రెపిల్లను గావు పట్టడం ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. ఈ గావు పట్టే తంతును చూసేందుకు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గావు పట్టిన రక్తాన్ని భక్తులు నుదుట పెట్టుకున్నారు. బోనమెత్తిన మహిళలు ఒకరి తరువాత ఒకరు గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ బీరన్న కుంటలోని ఆలయానికి చేరుకున్నారు. కరీమాబాద్ బొడ్రాయి వద్దకు మహిళలు, బీరన్నలు చేరుకొని గావు పట్టే సమయానికి ఓ ఎద్దు బొమ్మలగుడి నుంచి దూసుకురాగా, జనాలు ఒక్కసారిగా హడలిపోయారు. అందరూ గట్టిగా అరవడంతో తిరిగి బయటికి వెళ్లిపోయింది.

హాజరైన పలువురు ప్రముఖులు

కరీమాబాద్‌లో కురుమల ఆధ్వర్యంలో నిర్వహించిన బీరన్న బోనాల వేడుకలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరయ్యారు. ఉర్సు బీరన్న బోనాల వేడుకలకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, స్థానిక 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి పాల్గొన్నారు. మంత్రి సురేఖ రాక సందర్భంగా ఏసీపీ నందిరామ్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

బీరన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ఘనంగా బీరన్న బోనాల ఉత్సవాలు

శంభునిపేట, జూలై 17 : వరంగల్ రంగశాయిపేటలోని బీరన్న ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తూర్పు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రంగశాయిపేటలో బుధవారం బీరన్న బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మండల యాదగిరి డప్పుచప్పుళ్లతో పూజా సామగ్రిని ఆలయానికి తీసుకెళ్లి బీరన్న స్వామిని అలంకరించారు. బండారి (పసుపు)ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలంతా బోనాలను ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. కురుమ కులస్థులు డప్పుచప్పుళ్లతో, పోతరాజ వేషధారణతో చేసిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై బీరన్న స్వామిని దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బీరన్న స్వామిని దర్శించుకొని మాట్లాడారు. పండుగలు, జాతరలు భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తాయని అన్నారు. బీరన్న స్వామిని దర్శించుకున్న వారిలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, గంట రవికుమార్, గోపాల నవీన్‌రాజ్, జగిత్యాల జిల్లా జడ్జి కంచె ప్రసాద్, స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, కొంతం తారామోహన్, కర్ణె రవీందర్, నారగోని స్వప్నమురళి, బజ్జూరి రవి, తాళ్ళపల్లి అర్జున్, బక్కి రంజిత్, కర్రె వాసుదేవ్, కురుమ సంఘం అధ్యక్షుడు మండల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిగిరి కుమారస్వామి,



కాశిబుగ్గ బీరన్న దేవాలయంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మండల సీతారాములు, మండల నరసింహరాములు, సురేష్, చిరంజీవి, పరమేష్, కంచ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాగా, బీరన్న ఉత్సవాలకు విచ్చేసిన మంత్రి సురేఖను బీరన్న, వెంకటేశ్వర కాలనీల ప్రజలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ లేదని ఆవేదనను తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రిని కాలనీవాసులు సత్కరించారు.

ఓసిటీలో..

● మట్టెవాడ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తొలి బోనంను కురుమ కులస్థులు సమర్పించారు. తొలి బోనం బీరన్న దేవుడికి సమర్పించడం వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ కురుమ కులస్థుల ప్రత్యేకత. డోలు వాయిద్యాలతో బోనం ఎత్తుకొని భారీగా మహిళలు తరలి



రంగశాయిపేట బీరన్న ఆలయంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వచ్చి ఓసిటీలోని బీరన్న దేవాలయానికి చేరుకున్నారు. బీరన్న దేవుడికి ఇష్టమైన వాయిద్యాలతో, డప్పు చప్పుళ్లతో వినూత్న నృత్యాల మధ్య బోనాల జాతర జరిగింది. బోనాల సందర్భంగా గొపట్టి మేకపోతును బలిచ్చారు. బీరన్న బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి బోనం ఎత్తుకొన్నారు. బీరన్న బోనాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఆలయ అధ్యక్షుడు కంచ సంపత్, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, గుండేటి నరేంద్రకుమార్, బొమ్మినేని రవీందర్‌రెడ్డి, దిడ్డి కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి, దాసరి రాజేష్, సాంబరాజు, మీసాల ప్రకాశ్, సంపత్, పరమేశ్వర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగశాయిపేటలో బీరన్న స్వామిని దర్శించుకుంటున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



రంగశాయిపేటలో పూజా సామగ్రితో బయలుదేరిన పూజారి మండల యాదగిరి



ఓసిటీలో బీరన్న దేవాలయానికి బోనాలతో వస్తున్న మహిళలు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

శంభునిపేట, జూలై 17 : ఆరోగ్య సమస్యలు భరించలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మామునూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మామునూరు సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా గీసుగొండ మండలం దస్రు తండాకు చెందిన కేలోతు కిషన్ బొల్లికుంటలో భార్యాపిల్లలతో ఉంటున్నాడు. బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాల వద్ద ఓ హాస్టల్‌లో కిషన్ దంపతులు వంట మనుషులుగా పనిచేస్తున్నారు. కిషన్‌కు కూతురు నందు(17) తోపాటు కుమారుడు ఉన్నారు. నందు ఐనవోలులో గల కస్తూర్బాగాంధీ గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. గత కొంతకాలంగా నందు భుజం నొప్పితోపాటు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంది. కాగా, నొప్పి ఎక్కువ అవ్వటంతో ఈనెల 9న హోమ్‌సిక్ పెట్టి ఇంటికి వచ్చింది. పనిచేస్తున్న హాస్టల్‌లోనే కిషన్ దంపతులకు ఓ గదిని కేటాయించారు. కాగా, బుధవారం ఉదయం తల్లిదండ్రులు బయటకు వెళ్లగానే నందు ఆగదిలోనే ఉరి వేసుకొని మృతి చెందింది.

విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మామునూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు పోలీసులు తెలిపారు.

ఘనంగా మొహర్రం

హాజరైన మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి

ఆటోనగర్, జూలై 17: గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్‌లోని మొయిన్‌పురలో బుధవారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిగిన చరిత్రాత్మక పోరాట గుర్తింపే మొహర్రం అని తెలిపారు. మొహర్రం పండుగ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసిన పీరీలను అసైయ్‌దులా.. అంటూ డప్పుచప్పుళ్లతో వీధుల్లో ఊరేగిస్తారన్నారు. ప్రజలు పీరీలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం మేయర్ సుధారాణితో కలిసి మంత్రి సురేఖ మొహర్రం పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఫర్ఖాన్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, ఎండి.అయూబ్, అఫ్జల్, జమీల్, వసీమ్, షఫీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

● కరీమాబాద్ : నగరంలోని అండర్ రైల్వేగేటు ఉర్సు, కరీమాబాద్ ప్రాంతంలోని ముస్లింలు బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరీమాబాద్ ప్రాంతంలోని నానమియాతోటలో ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు



నానమియాతోటలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

సాదిక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లింలు సారయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఠాధిపతి ఎహియా పాషా ఖాద్రీ, యాకుబ్, రబ్బానీ, దస్తగిర్, అబ్బుఖాన్, షఫీ మౌలానా, నన్హయాకుబ్, సర్దార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

● మిల్స్‌కాలనీ : మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నగరంలో జరిగిన వివిధ ప్రాంతాలను సందర్శించి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కరీమాబాద్, ఖిలావరంగల్, మండిబజార్, ఎల్లంబజార్ తదితర ప్రాంతాల్లో మొహర్రం వేడుకలను సందర్శించారు. ఆయన వెంటన బీజేపీ నాయకులు ఉన్నారు.

చెరువులు, కుంటలను ప్రభుత్వం రక్షించాలి

సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళిచర్ల సుదర్శన్

ఖిలావరంగల్, జూలై 17: జిల్లాలో భూకబ్జాదారుల నుంచి చెరువులు, కుంటలను ప్రభుత్వం రక్షించాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళిచర్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. బుధవారం శివనగర్‌లోని ఉమ్మడి వరంగల్ జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య న్యాయ సలహా కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాలన్నీ గత ఐదేళ్లుగా ముంపునకు గురవుతున్నాయన్నారు. దేశాయిపేట, చిన్నవడ్డేపల్లి చెరువు, తిమ్మాపూర్‌లోని బెస్తంచెరువు, మట్టెవాడలోని కోటచెరువు, ఉర్సులోని రంగసముద్రం చెరువు, గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు, సాకరాశి కుంట, భద్రకాళి చెరువు శిఖాలు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తకు నివేదికను ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటల ఆక్రమణలపై సరైన చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు న్యాయవాది యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు, చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ప్రజాప్రయోజన వాజ్యంగా, ప్రైవేట్ రిట్ పిటీషన్ ద్వారా న్యాయపోరాటం చేయాలని సూచించారు. ఈ తీర్మానానికి మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ వైస్ చైర్మన్ రంగరాజు ఆనందరావు, సీనియర్ న్యాయవాదులు రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, ఏఐసీడబ్ల్యూసీ అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్, మండలి అధ్యక్షుడు మురహరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



భూ సర్వే వివరాలను తెలుసుకుంటున్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

మామునూరు ఎయిర్‌పోర్టు భూముల సర్వే

వివరాలను తెలుసుకున్న కుడా చైర్మన్ ఇనుగాల

సంగెం, జూలై 17: మామునూరు ఎయిర్‌పోర్టు భూములను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మండలంలోని గుంటూరుపల్లి గ్రామ సమీపంలో భూములకు సంబంధించి జరుగుతున్న సర్వేను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మామునూరు విమానాశ్రయంను పునరుద్ధరించి విమాన రాకపోకలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నదని తెలిపారు.

గతంలో విమానాశ్రయంకు ఉన్న భూములతో పాటు మరికొంత భూమి కోసం సర్వే చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇక్కడి రైతుల సహకారంతో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విమానాశ్రయం విస్తరణ విషయంలో రైతులు సహకారం అందించాలని ఆయన కోరారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

దేవాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు

మట్టెవాడ, జూలై 17: వరంగల్ నగరంలోని పలు దేవాలయాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులతో దేవాలయాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. వరంగల్ బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామి దేవాలయం, గీతా మందిర్, కృష్ణ మందిర్, కాశిబుగ్గ రంగనాయకస్వామి, కాశీవిశ్వేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాశీవిశ్వేశ్వర రంగనాథ ఆలయం సమీపంలోని కాశిబుగ్గ బావి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బాలానగర వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 8 గంటల నుంచి స్వామి వారికి 108 కళాశాలు, 108 లీటర్ల ఆవు పాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకం స్నపన సేవా సమితి వారిచే నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి భగవద్గీత పారాయణం (18 అధ్యాయాలు) అనంతరం స్వామి వారికి లక్ష పుష్పార్చన శ్రీ వేంకటేశ్వర సేవా సమితి, సుప్రభాత సేవా సమితి వారిచే నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రత్యేక పూజల్లో



కాశిబుగ్గ రంగనాథ స్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కృష్ణ మందిర్‌లో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సేవా సమితి సభ్యులు, ఆలయ ఈవో ఏలపాటి రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, అర్చకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయంలో నిర్వహించిన ఏకాదశి వేడుకల్లో ఉదయం 4 గంటల నుంచే రంగనాథ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆషాడ మాసంలో వచ్చే తొలి ఏకాదశి అత్యంత ప్రాముఖ్యం కలిగిందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరు సురేశ్, సాంబారి ప్రభాకర్, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కోశాధికారి సుల్తానా, సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఆడిటర్ జి.సుధాకర్, అంబి సాంబరాజు, శ్రీనివాస్, ప్రసాద్, ప్రకాశ్‌రెడ్డి, కాశీవిశ్వేశ్వర రంగనాథ ఆలయ పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, సాంబయ్య, ఎల్లయ్య, బాలరాజు, వైకుంఠం, అశోక్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలకు మహిళలు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గీసుగొండలోని శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, వంచనగిరి కోట మైసమ్మ ఆలయం, కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, ధర్మారంలోని రామలింగేశ్వరాలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది.

గురుపౌర్ణమి వేడుకల విజయవంతం చేయాలి

పోచమ్మమైదాన్, జూలై 17: గ్రేటర్ వరంగల్ పైడిపెల్లిలోని సప్తధామ్(గురుధామం)లో ఈనెల 21వ తేదీన గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. మూడవ డివిజన్ పైడిపెల్లిలోని సప్తధామ్‌లో బుధవారం గురుపౌర్ణమి వేడుకల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా అభిషేకం, హారతి, పుష్పార్చన, పల్లకీ సేవ, గురు వందనంలో అఖండ బిల్వార్చన, విభూది, రుద్రాక్షలతో అర్చన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురుపౌర్ణమి వేడుకలకు దేశ, విదేశాల నుంచి శివానందమూర్తి భక్తులు తరలిరానున్నారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శివానందగురు ఆశీస్సులు పొందాలని, ప్రసాదం, భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయినారాయణ, గందె ఉమాశంకర్, లాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నోటీసులను ఉపసంహరించుకోవాలి

కార్పొరేటర్ గందె కల్పననవీన్

మట్టెవాడ, జూలై 17: నగరంలోని భద్రకాళి బండ్ సమీపంలో వివిధ కాలనీ వాసులకు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పననవీన్ డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్ పిన్నవారి వీధిలోని కార్పొరేటర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కల్పననవీన్ మాట్లాడుతూ భద్రకాళి చెరువు 1997లోనే అప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వ అధికారులు నిర్ణయించిన మేరకు ఆయకట్టులో ఉన్న వ్యవసాయదారులు డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఆ డబ్బుతోనే ఈ రోజు ఉన్న భద్రకాళి చెరువు చుట్టూ బండ్‌ను నిర్మాణం చేపట్టారని, బెటర్మెంట్ చార్జీల కింద ప్రభుత్వానికి ఫీజు చెల్లించారని తెలిపారు. అప్పుడున్న టీడీపీ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఎన్‌టీఆర్ నగర్‌లో పట్టాలు ఇచ్చిందన్నారు. ఎన్‌టీఆర్ కాలనీ అని పేరు కూడా పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కాకుండా సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ, సాయినగర్ కాలనీ, సంతోషిమాత కాలనీటు భద్రకాళి కాలనీ, దుర్గాదేవి కాలనీ, ఎస్సీ కాలనీ కొంత మంది చుట్టుపక్కల గ్రామాల్లో వారి ఆస్తులను అమ్ముకొని ఎంతో కొంత స్థలం కొనుగోలు చేసి కూలీనాలి చేసుకుంటూ బతుకుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇంటి పన్నులు, పర్మిషన్, తాగునీటి పన్నులు కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తున్నారని, ఇప్పుడు నోటీసులు ఎందుకు ఇస్తున్నారని కార్పొరేటర్ ప్రశ్నించారు సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు గందె నవీన్, డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, కొత్తపల్లి రాజేష్, లోకేష్, పవన్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు పలువురి పరామర్శ



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎర్రబెల్లి, ధర్మారెడ్డి తదితరులు

సంగెం, జూలై 17: మండలంలోని గుం టూరుపల్లిలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు తండ్రి సుబ్బారావు మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు జరిగాయి. దీంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, డాక్టర్ పోలా నటరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సదానం దం, మాజీ జడ్పీటీసీలు గూడ సుదర్శన్‌రెడ్డి, గుగులోతు వీరమ్మ, మాజీ ఎంపీపీలు కక్కెర్ల సదానందం, సొల్లేటి వీరాచారితో పాటు పలువురు సుబ్బారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 18 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

బాలిక మృతిపై కేసు నమోదు

పర్వతగిరి, జూలై 17 : మండలంలోని దేవీలాల్‌తండాలో అనుమానాస్పదంగా మృతిచెందిన గుగులోత్ ఐశ్వర్య మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండాకు చెందిన గుగులోత్ మాన్య-అంబాలి దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, కూతురు ఐశ్వర్య (16) మండలంలోని కల్లెడలో ఆర్డీఎఫ్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి వచ్చి మంచంపై నిద్రపోయిన స్థితిలో ఉంది. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు పరీక్షించి చూడగా చీరతో గొంతుకు ఉరివేసినట్లు గాట్లు ఉన్నాయని, అనుమానంతో మండల కేంద్రంలోని ఆర్ఎంపీ డాక్టరు వద్దకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు ధృవీకరించాడని తెలిపారు. మృతురాలి తండ్రి గుగులోత్ మాన్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఐశ్వర్యకు ఇటీవలే మండలంలోని రోళ్లకల్లు తండాకు చెందిన వ్యక్తితో ఎంగేజ్‌మెంట్ అయినట్లు సమాచారం.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



నర్సంపేటలోని వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్, భక్తులు

నర్సంపేట, జూలై 17 : నర్సంపేట నియోజకవర్గ ప్రజలు, భక్తులు బుధవారం తొలి ఏకాదశి పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయాల్లో అర్చనలు, అభిషేక పూజలు చేశారు. పట్టణంలోని శివాం జనేయస్వామి దేవాలయం, అయ్యప్పదేవాలయం, శిరిడిసాయిబాబా ఆలయం, వేంకటేశ్వరాలయాలకు వెళ్ళి భక్తులు అభిషేక, అర్చన పూజలుచేశారు. వేంకటేశ్వరాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రామానుజాచార్యులు అర్చనలు, అభిషేక పూజలను చేయించారు. అలాగే ధ్వజ స్తంభం వద్ద ఆలయచైర్మన్, భక్తులచే అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తుల గోత్రనామార్చన పూజలు చేసి తీర్థప్రసాదాలను అందించారు.

- రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు జరిగాయి. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెంకటేశ్వరపెల్లిలోని సన్నూరు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- నెక్కొండ: తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలను జరిపారు.
- గీసుగొండ : మండలంలో తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలకు మహిళలు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గీసుగొండలోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, వంచనగిరి కోట మైసమ్మ ఆలయం, కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, ధర్మారంలోని రామలింగేశ్వరాలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. ఆలయాలవద్ద భక్తుల సందడి కనిపించింది.

వైభవంగా బీరన్న బోనాలు



నెక్కొండ మండలం నాగారంలో బీరన్న బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నెక్కొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం జరిగిన బీరన్న బోనాల వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. కురుమ కులస్థులు బీరన్నను కొలుస్తూ నైవేద్య ప్రసాదాలతో బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కురుమ కుల సంఘం పెద్ద మనుషులు మీరాల మల్లయ్య, అటికే పెద్దకట్టయ్య మాట్లాడుతూ ప్రతీఏటా బీరన్న బోనాలు చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రతి ఇంటి నుంచి డోలు, సన్నాయి వాయిద్యాలతో బీరన్న కోలాటాలతో నృత్యాలు చేస్తూ భక్తులు గుడి వరకు వెళ్లారు.

- చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో బీరన్న బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కురుమ కులస్థుల ఆరాధ్యదైవమైన బీరన్నకు ప్రత్యేకంగా బెల్లం, పాలతో చేసిన పరమాన్నంను సమర్పించారు. పసుపు కుంకుమలతో పూజలు చేసి బీరన్నకు మొక్కులు అప్పజెప్పారు. కార్యక్రమంలో కోరే మల్లయ్య, కుండె సురేష్, కుండె మల్లయ్య, కుండె కుమారస్వామి, నరిగే శివరాజు, రవి, మదురు రమేష్, ఇల్లా సూరయ్య, సుధాకర్, కుండె పోషాలు, కొంరయ్య, కుండె కర్నాకర్, పాకయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.
- ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట, కొత్తూరు గ్రామాల్లో గొల్ల కురుమలు బీరన్న బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ తరలివెళ్లి వారి కులదైవమైన బీరన్న, అక్క మహంకాళి దేవీలకు బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మరావుపేట జరిగిన కార్యక్రమంలో కులపెద్దలు కోరె సుధాకర్, రమేష్, గణేష్, చేరాలు, కర్నాకర్, కుమారస్వామి, కుమారస్వామి, కుండె ప్రభాకర్, కొత్తూరులో కోరె రాములు, కొమ్ము రాజు, భిక్షపతి, కోటి, కట్టయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని చెక్‌డ్యాంలు

ఆకేరు వాగు నీటి నిల్వలకు విఘాతం

పట్టించుకోని సంబంధిత అధికారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 17 : భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే పల్లెల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, వాగులకు అడ్డుగా చెక్ డ్యాంలు ఏర్పాటు చేస్తోంది. గత ప్రభుత్వాలు ఇందుకోసం రూ. వేల కోట్ల రూపాయాలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. కానీ, వాటి నిర్వహణ తీరును ప్రస్తుత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్వహణ లోపంతో సైతం ఆశించిన స్థాయిలు ఫలితాలు కానరావడం లేదని చెప్పాలి. చిన్న చిన్న మరమ్మతు పనులను సైతం సకాలం చేయక పోవడంతో అన్నదాతలు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి.

గతేడాది తెగిపోగా..

వర్ధన్నపేట మండలంలో నీటినిల్వకు, భూగర్భ జలాల పెంపునకు ప్రధాన నీటి వనరుగా ఉన్న ఆకేరు వాగుపై ప్రజాప్రతినిధులు, అధికారులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. మండలంలోని ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల మీదుగా వెళ్తున్న ఆకేరు వాగు చుట్టూ పక్కల రైతులకు, నివాస ప్రాంత ప్రజలకు కల్పవల్లిగా ఉంది. వేసవి కాలంలో సైతం నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు, భూగర్భ జలాలు అడుగంటి పోకుండా కాపాడుతోంది. అలాంటి ఆకేరు వాగు నిర్వహణపై నీటి పారుదల శాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు.గతేడాది ఇల్లంద గ్రామం వైపున ఆకేరు వాగు చెక్ డ్యాం చివరి నిర్మాణం తెగిపోయింది. దీంతో వాగులోని నీరంతా దిగువకు వెళ్లిపోయింది. మళ్లీ ఏడాది గడుస్తున్నా డ్యామేజ్ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులు చర్యలు చేపట్టలేదు. వరద వచ్చి చేరితే నీరు వాగు నిల్వ ఉండే పరిస్థితి లేదు. పూర్తిగా నీరు దిగువకు వెళ్లిపోవడం మూలంగా, అన్నదాతలకు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది.

నాయకులకు కనిపించడం లేదా..

వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల మధ్యలో నుంచి వెళ్తున్న ఆకేరు వాగు పరిస్థితి స్థానిక నాయకులకు కనిపించడం లేదా అంటూ ఇటు పట్టణవాసులు, అటు గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు రోజు వాగు పైనుంచి అటూ ఇటు తిరుగుతున్నారని, కనీసం ఆకేరు వాగు చెక్‌డ్యాం సమస్యను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో విఫలమతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునిసిపాలిటీ చైర్మన్, కౌన్సిలర్లు, అటు మండల పార్టీ అధ్యక్షుడు, జిల్లా నాయకులు ఉన్నప్పటికీ గ్రామాలకు నీటి వారధిగా ఉన్న ఆకేరు వాగు పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కాగానే నీటి పారుదల శాఖ అధికారులు సైతం గ్రామాల్లోని నీటి వనరులైన చెరువులు, కుంటలు, వాగులను సందర్శించి సమస్యలను ఏకరువు పెట్టాలి. విపత్తులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు సైతం తీసుకోవాలి. సమస్యలు ఎక్కడున్నాయో జిల్లా ఉన్నతాధికారులకు తెలియచేయాలి. కానీ, అలాంటి పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. నీటి పారుదల శాఖ నిద్రమత్తు కారణంగా ఏడాదిగా ఆకేరు వాగు చెక్ డ్యాం మరమ్మతుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



ఇల్లంద శివారులో కొట్టుకుపోయిన ఆకేరు వాగు చెక్ డ్యాం చివరి భాగం

భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడతాయి..

తక్కళ్లపెల్లి శ్రీదేవి, బీజేపీ నాయకురాలు, ఇల్లంద



ఇప్పటికే చాలీచాలనీ వర్షాలతో కాలం అవుతుందో లేదో అనే అనిశ్చితిలో ఉన్నాం. పై నుంచి వచ్చే వరదను ఆపి నీటిని నిల్వ చేస్తేనే భూగర్భ జలాలు నిశితంగా ఉండి ఇబ్బందులు లేకుండా చేస్తుంది. చెక్ డ్యాం మరమ్మతులకు నోచుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు లేకపోలేదు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వెంటనే మరమ్మతులు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి.

ఘనంగా మొహర్రం వేడుకలు



రెబల్లేలో పీరీలతో ఊరేగింపు చేస్తున్న ముస్లింలు

దుగ్గొండి, జూలై 17 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా మొహర్రం పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హస్సేన్, హుస్సేన్ జ్ఞాపకార్థం ప్రతి రూపాలుగా పీరీలను నెలకొల్పి పది రోజుల పాటు నిర్వహించి పదో రోజు నిమజ్జనం చేస్తారు. భక్తులు ఊదు బెల్లం సవార్లకు సమర్పించి మొక్కలు తీర్చుకుంటారు. మండలంలోని తిమ్మంపేటలో ప్రధాన కూడలి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి దాని నుంచి నడవడం చేశారు. మండలంలోని రెబల్లే, తిమ్మంపేట, దుగ్గొండి, పొనకల్ తదితర గ్రామాల్లో పీరీలను నెలకొల్పి ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జబ్బర్, హిమాం సాహెబ్, యాకూబ్ హుస్సేన్, ప్రభాకర్, రాజు, ఐలయ్య, షహనాజ్ బేగం, రాజమల్లు, దీపిక, గుంజె సాంబయ్య, ఎడ సాంబయ్య పాల్గొన్నారు.

- రాయపర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా మొహర్రం వేడుకలు జరిగాయి. హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పీరీలను గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువుల్లో, బావుల్లో నిమజ్జనం చేశారు. ఇంట్లో పిండి వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు.
- నెక్కొండ : మండలంలోని గ్రామాల్లో జరిగిన మొహర్రం పండుగ వేడుకల్లో ముస్లిం భక్తులు ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. పీర్లను మంగళవారం రాత్రి నిమ్మనం చేశారు. త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.
- పర్వతగిరి : మొహర్రం వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీరీలను ఎత్తుకుని గ్రామాల్లో వీధులగుండా ఊరేగిస్తూ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.
- చెన్నారావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన పీరాల వద్ద వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో నిమజ్జన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, ఎంఏ గఫ్ఫార్, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, అంకుస్, రఫీ, వసీం అక్రమ్, చిరుతం సంపత్ పాల్గొన్నారు.

నేటి నుంచి రుణమాఫీ సంబరాలు

వర్ధన్నపేట రూరల్, జూలై 17 : నేటి నుంచి రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ఏవో సాగరిక ఒక ప్రకటనలో తెలిపారు. రూ. లక్ష లోపు రుణాలు మాఫీ చేసే కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా ప్రారంభిస్తున్న సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైతు వేదికల్లో లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖిగా మాట్లాడతారని స్పష్టం చేశారు. దీంతో పాటు రైతు వేదికల్లో సంబరాలు చేసుకునే నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పేదలు సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

పర్వతగిరి, జూలై 17 : పేదలు సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని ఎస్సీ సంక్షేమ సంఘం నాయకుడు జిల్లా కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని జమాల్‌పురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అసైన్డ్ భూములను సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వక పోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని హామీ ఇచ్చిందని, దానికి కట్టుబడి పట్టాలిప్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని, కానీ, తమకు మాఫీ సంబురం లేకుండాపోయిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పట్టాలిప్పించాలని ఆయన కోరారు.

పేరుకు 5జీ.. ఇచ్చేది 2జీ సిమ్ కార్డులు



2జీ సిమ్‌కార్డు అని చూపుతున్న వినియోగదారుడు

వర్ధన్నపేట, జూలై 17 : వర్ధన్నపేట పట్టణంలో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు అందిస్తుందని సిమ్ కార్డులు విక్రయిస్తున్న వ్యక్తి వద్ద సిమ్‌కార్డు కొనుగోలు చేసిన వ్యక్తులు సెల్‌ఫోన్‌లో సిమ్ కార్డు వేయడంతో 2జీ సేవలు మాత్రమే వస్తుండడంతో అవాక్కయ్యారు. 5జీ అని సిమ్‌కార్డు కొనుగోలుచేస్తే సిగ్నల్‌మాత్రం 2జీ వస్తుందని సిమ్ కార్డులు విక్రయించే వ్యక్తితో వాగ్వివాదానికిదిగారు. 5జీ సేవలు ప్రారంభం కాకుండానే సిమ్ కార్డులు ఎలా విక్రయిస్తారని సదరు వ్యక్తిని నిలదీశారు. కొన్ని రోజులుగా ఇతర టెలికాం సంస్థలు రేట్లు పెంచడంతో బీఎస్ఎన్ఎల్ కూడా 5జీ సేవలందిస్తుందనే ప్రచారంతో సంతోషం వ్యక్తం చేసిన వినియోగదారులు సిమ్‌కార్డు కొనుగోలు చేయడానికి, పోర్టు పెట్టుకోవడానికి ఆసక్తి చూపారు. కానీ పరిస్థితి తలకిందులు కావడంతో 5జీ సేవలు వర్ధన్నపేటలో ప్రారంభించాకే సిమ్‌కార్డులు విక్రయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలి



శ్రీనివాస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

నల్లబెల్లి, జూలై 17: అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని నర్సంపేట మాజీ ఎమెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారక్కపేటలో బుధవారం ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ దశదిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపుల వల్లే ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ప్రభుత్వం ఆయన ఆత్మహత్యకు పూర్తి బాధ్యత వహించి కటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట నాయకులు బానోతు సారంగపాణి, గందె శ్రీనివాస్‌గుప్తా, నానబోయిన రాజారాం, కారుకూరి శ్రీనివాస్, మోర్తాల రామారావు, వక్కల చంద్రమౌళి, ఓదెల రవి, చంద్రశేఖర్, రమేష్ తదితరులు ఉన్నారు. అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ నిజాయితీగా పనిచేస్తున్న క్రమంలో తనపై అధికారి సీఐ అక్రమ వసూళ్ల పేరుతో ఎస్సైని వేధించడంతో ఆత్మ గౌరవం దెబ్బతిని ఆత్మహత్యకు పల్పడ్డాడని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి అన్నారు. ఎస్సై శ్రీనివాస్ దశదిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన పోలీసు అధికారులను వెంటనే చట్ట ప్రకారం శిక్షించాలని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, రైతు సంఘం నాయకులు రామచంద్రయ్య, గోవిందు, మొగిళి, సైదమ్మ, చైతన్య భారతి, గుండె ప్రసాద్, ఎర్ర మోహనకృష్ణ తదితరులు ఉన్నారు.

సీఐని విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలి

పర్వతగిరి: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐపై వేగవంతంగా విచారణ పూర్తిచేసి విధుల నుంచి తొలగించి ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పర్వతగిరిలో స్వేరో, ఎస్ఎఫ్ఐ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వేరో జిల్లా సెక్రటరీ గారె జయరాజ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల వేధింపుల వల్ల ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై శ్రీనివాస్ సూసైడ్ నోట్‌లో పేర్లతో సహా వెల్లడించినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, నాయకులు బానోత్ రమేష్, దినేష్, రాహుల్ పాల్గొన్నారు.

శ్మశానవాటికను పట్టించుకునే నాథుడేడి?





శ్మశానవాటికలో ఉన్న పోస్టుమార్టం గది, పిచ్చిమొక్కలతో నిండిన వైకుంఠధామం

వర్ధన్నపేట, జూలై 17 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్మశానవాటికను పర్యవేక్షించే నాథుడు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డు పరిధిలోని శ్మశానవాటికను అధికారులు పునరుద్ధరించి అక్కడ కర్మఖాండలు నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కానీ, మృతదేహాలను ఖననం చేసే ప్రజలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఖననం చేయాల్సిన నిర్దేశిత ప్రదేశంలో కాకుండా మరో ప్రదేశంలో అంతిమ సంస్కార కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశానవాటిక సమీపంలోనే పోస్టుమార్టం గదిని అన్ని వసతులతో నూతనంగా నిర్మించారు. ఇతర గ్రామాలకు చెందిన ప్రజలకు సౌకర్యంగా ఉన్నప్పటికీ స్థానికులకు ఇబ్బందికరంగా పరిణమించింది. శ్మశానవాటికలోని క్రిమియేషన్ వేదికలో కాకుండా బయట మృతదేహాలను దగ్ధంచేస్తున్నారు. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందిగా పరిణమించాయి. శుభ్రం చేయడానికి రొటవేటర్, డోజర్ సౌకర్యం ఉన్నప్పటికీ మునిసిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన వనసేవక్‌ను మరో చోటకు తరలించడంతో మొక్కలకు నీరులేక ఎండిపోయాయి.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు పరామర్శ

సంగెం, జూలై 17 : మండలంలోని గుంటూరుపల్లిలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు తండ్రి సుబ్బారావు మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు జరిగాయి. దీంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, డాక్టర్ పోలా నటరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సదానందం, మాజీ జడ్పీటీసీలు గూడ సుదర్శన్‌రెడ్డి, గుగులోతు వీరమ్మ, మాజీ ఎంపీపీలు కక్కెర్ల సదానందం, వీరాచారితో పాటు పలువురు సుబ్బారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబానికి..

చెన్నారావుపేట, జూలై 17 : మండలంలోని పదహారు చింతల్ తండాలో జంట హత్యలకు గురైన బానోతు శ్రీను-సుగుణ కుటుంబాన్ని గోర్ సేనా జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర శోభన్ బుధవారం పరామర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు పిల్లలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి, ఉరిశిక్ష వేయాలన్నారు. ఆయన వెంట గోర్ సేనా జిల్లా అధ్యక్షుడు కిషన్, జాటోతు సురేష్, హట్యానాయక్, కిషన్‌నాయక్, మాజీ ఎంపీపీ రమేష్‌నాయక్, మాత్రు రాథోడ్ తదితరులు ఉన్నారు.

అనుమతి ఒకచోట.. తవ్వకాలు మరోచోట



ఎస్సారెస్పీ కెనాల్ నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లు

వర్ధన్నపేట, జూలై 17: మొరం తవ్వకానికి నీటి పారుదల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. అనుమతి ఇచ్చిన చోట మొరం నాణ్యతగా లేదని పక్క మండలంలోని ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌కు రక్షణగా ఉన్న మొరాన్ని యదేచ్ఛగా తరలిస్తున్న సంఘటన మంగళవారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని నీలగిరిస్వామితండా వద్ద చోటు చేసుకుంది. నీటిపారుదల శాఖ అధికారులు రాయపర్తి మండలంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద మొరం తవ్వడానికి హనుమకొండ జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. అనుమతి ఇచ్చిన చోట మొరం నాణ్యతగా లేదని ఎక్కువ దూరం అవుతుందని జాతీయ రహదారి పక్కనే ఉన్న వర్ధన్నపేట పట్టణ శివారు నీలగిరిస్వామితండా వద్ద ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌కు రక్షణగా ఉన్న మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న మండల రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ప్రభుత్వ అనుమతి ఉందంటూ దాటవేస్తున్నారే తప్ప ఎక్కడ తవ్వేందుకు అనుమతి ఇచ్చారు. ఎక్కడ నుంచి తవ్వి తీసుకువెళుతున్నారన్న అంశం తెలిసినా పెద్దల హస్తం ఉండడంతో వారు సైతం తప్పించుకుంటున్నారు. ఈ మొరంను తరలించడానికి నీటిపారుదల శాఖ అధికారులు ఆరు టిప్పర్‌లకు అనుమతి ఇవ్వగా 12 టిప్పర్‌లతో యథేచ్ఛగా మొరాన్ని తరలిస్తున్నారు. మొరంను తరలించే స్థలం వద్ద నీటిపారుదల శాఖ అధికాలు ఉండాల్సి ఉండగా వారి జాడకానరాలేదు. వారికి ఫోన్ చేసినా స్పందించడం లేదు.

జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

సంగెం, జూలై 17 : మండల ప్రజలు జ్వరాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి ఉదయ్ రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారందరికి ఉచితంగా పరీక్షలుచేసి మందులు అందించారు.

కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా విజేందర్ ఎన్నిక



విజేందర్

చెన్నారావుపేట, జూలై 17: మండల కేంద్రానికి చెందిన లక్క విజేందర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధ వరెడ్డి ఆదేశాల మేరకు విజేందర్‌ను నియామకం చేశామన్నా రు. విజేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించడంపై పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

టేకులకుంట తండాలో ఒకరి అదృశ్యం



రాంచందర్

చెన్నారావుపేట, జూలై 17: మండలంలోని టేకులకుంట తండాలో ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై గూడ అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన 48ఏళ్ల వయస్సున్న బానోతు రాంచందర్ ప్లాస్టిక్ సా మానులు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు పనికోసం వెళ్లిన రాంచందర్ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనదారులు రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలి

చెన్నారావుపేట, జూలై 17: వాహనదారులు రిజిస్ట్రేషన్ పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం నెక్కొండ-చెన్నారావుపేట ప్రధానరహదారిపై వాహనదారుల పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రతీ ఒక్కరు లైసెన్స్‌తో పాటు వాహన ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలని అన్నారు.

డిల్లెం.. బల్లెం.. బీరన్నకు బోనం..

(3వ పేజీ తరువాయి)

బీరన్నలు చేసిన నృత్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కరీమాబాద్ ప్రాంతంలో కురుమల కుల సంఘం భవనం నుంచి ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరె సదానందం, కమిటీ బాధ్యులు పట్టు వస్త్రాలు, జాతీయ జెండాను చేతబూని పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ తంతుతో కరీమాబాద్ బీరన్న బోనాలు ప్రారంభమయ్యాయి. సైదాపూర్ నుంచి బీరన్నలు ఇంటింటికి తిరుగుతూ బోనాలను చేయాల్సిందిగా చాటింపు చేశారు. అన్ని సిద్ధం చేశాక సాయంత్రం మహిళలు భక్తి పారవశ్యంతో తలపై బోనాలతో వరుస క్రమంలో కరీమాబాద్ పురవీధులు గుండా ఆలయానికి బయలుదేరారు. బోనాలు ఆలయానికి వస్తున్న క్రమంలో సైదాపూర్ బీరన్నలు చేసిన నృత్యాలు, విన్యాసాలు, కరీమాబాద్ ప్రాంతం బొమ్మలగుడి సమీపంలో గల బొడ్రాయి వద్ద గొర్రెపిల్లను గావు పట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గావు పట్టే తంతును చూసేందుకు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గావు పట్టిన రక్తాన్ని భక్తులు నుదుట పెట్టుకున్నారు. బోనమెత్తిన మహిళలు ఒకరి తరువాత ఒకరు గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ బీరన్నకుంటలోని ఆలయానికి చేరుకున్నారు. కరీమాబాద్ బొడ్రాయి వద్దకు మహిళలు, బీరన్నలు చేరుకొని గావు పట్టే సమయానికి ఓ ఎద్దు బొమ్మలగుడి నుంచి దూసుకురాగా, జనాలు ఒక్కసారిగా హడలిపోయారు. అందరూ గట్టిగా అరవడంతో తిరిగి బయటికి వెళ్లిపోయింది.

హాజరైన పలువురు ప్రముఖులు

కరీమాబాద్‌లో కురుమల ఆధ్వర్యంలో నిర్వహించిన బీరన్న బోనాల వేడుకలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరయ్యారు. ఉర్సు బీరన్న బోనాల వేడుకలకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, స్థానిక 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి పాల్గొన్నారు. మంత్రి సురేఖ రాక సందర్భంగా ఏసీపీ నందిరామ్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.